## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సాప్ ద్వారా పంపగలరు



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

పాఠకుల్ని మరింతగా చైతన్యం చేసేందుకు, ప్రజా చైతన్యమే లక్ష్యంగా నూతనంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు | మండల | నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number : 9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 73 ఎడిటర్ :పెనుగొండ సతీష్ బుధవారం 22 అక్టోబర్ 2025 పేజీలు 8 వెల 5.00






# పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా

- విధి నిర్వహణలోఎందరో పోలీసుల ప్రాణార్పణం
- అమరులను సంస్మరించుకోవడం మన విధి
- అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ
- నిజామబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం
- సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం
- పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భగా రేవంత్ నివాళి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 21 : పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయదని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పోలీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు సీఎం నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని సీఎం వ్యాఖ్యానించారు. ఆ బాధ్యతతోనే



దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'గా ఘనంగా నిర్వహించు కుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు

2 లో

## ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటాం

- బాధిత కుటుంబానికి డిజిపి పరామర్శ
- అంకితభావంతో పనిచేసే పోలీసును కోల్పోయాం
- రియాజ్ ఎన్‌కౌంటర్‌పై విచారణ
- ఆస్పత్రిలో గాయపడ్డ ఆసిఫ్‌కు పరామర్శ

(ఆకాంక్ష న్యూస్)

నిజామాబాద్,అక్టోబర్21 : ఇటీవల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని కానిస్టేబుల్ ఇంటికి వచ్చిన డీజీపీ, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పలువురు ఉన్నతాధికారులు.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఒక మంచి కానిస్టేబుల్‌ను కోల్పోయామన్నారు. ఇది పోలీస్ శాఖను తీవ్రకలవరానికి గురి చేసిందన్నారు. రియాజ్ ఎన్



కౌంటర్ ఘటనపై విచారణ జరుగుతోంది. విచారణ జరుగుతున్నప్పుడు కేసు గురించి మాట్లాడితే దర్యాప్తు అధికారిని ప్రభావితం చేసినట్లు అవుతుంది. ప్రమోద్ కుటుంబానికి రూ.కోటి పరిహారం, సెప్టెంబరు నెల వేతనం ఎంత తీసుకున్నారో ఆ మొత్తాన్ని పదవీ విరమణ తేదీ వరకు ప్రతినెలా ఆయన కుటుంబానికి అందించాలని, 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పోలీసు భద్రత, వెల్ఫేర్

2 లో

## గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో ?

- దానం నాగేందర్ స్టార్ కాంపెయినర్ ఎలా
- ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన కెటిఆర్
- ప్రభుత్వ వైద్యానికి సుస్తీ పట్టిందని విమర్శ

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 21 : పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు. ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీలో గెలిచిన వాళ్లను తీసుకుని, వాళ్ల పార్టీ



క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలికొదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

2 లో

## బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్

- కిషన్ రెడ్డి, రామచంద్రరావుతో కలిసి వచ్చిన దీపక్
- ముగిసిన నామినేషన్ల పర్వం




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 21 :జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత వెంకటగిరిలోని విజయదుర్గ పోచమ్మ ఆలయంలో దీపక్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా

2 లో

## పోలీస్ క్రికెట్ టీమ్‌కు టైటిల్




(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 21 : ఛామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీ ని పోలీస్ క్రికెట్ టీం గెలుపొందింది. అక్టోబర్ 9,10 తేదీల్లో ఉప్పల్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం లో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో టాలి వుడ్ టీం పై పోలీస్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. విన్నర్ టీమ్ కు లభించిన ఐదు లక్షలు, రన్నర్ టీమ్ కు లభించిన 3 లక్షల రూపాయల నగదు బహుమతిని పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని పోలీసు సంక్షేమ నిధికి అందచేస్తూ ఈ చెక్కును రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శ సీవీ ఆనంద్ కు నేడు సచివాలయంలో నిర్వాహకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ క్రికెట్ టీమ్ సభ్యులతో పాటు, బీసీసీఐ, ప్రణవ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేడెక్కిన జూబ్లీహిల్స్ ప్రచారం

- దీపక్ రెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రుల ప్రచారం
- జూబ్లీహిల్స కిషన్ రెడ్డి అడ్డా అన్న బండి సంజయ్

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్21 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కింది. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను విమర్శించారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. ఏయ్ బిడ్డా? జూబ్లిహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అంటూ ప్రారంభించిన ఆయన.. కిషన్ రెడ్డి నాయకత్వంలో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అని ఆయన విమర్శించారు. ఈ రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని



ఆయన ఆరోపించారు.. ఈ రెండు పార్టీల పాలనలో జూబ్లిహిల్స్ ప్రజలకు ఒరిగిందేమిటి? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదని, అయితే హరీష్ రావు చెప్పగానే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్‌కు మద్దతిస్తే, ఆయన తమ్ముడు బీఆర్ఎస్‌కు వత్తాసు

2 లో

## ఆరోగ్య రంగంలో హుస్నాబాద్ అభివృద్ధి

- ఆసుపత్రి నిర్మాణం తరవాత పూర్తిస్థాయి స్టాఫ్ - మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



(ఆకాంక్ష న్యూస్)

సిద్దిపేట, అక్టోబర్21 : హుస్నాబాద్‌ను ఆరోగ్యరంగంలో నెంబర్ వన్ కేంద్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు పనిచేస్తున్నారని, కొత్త భవనం పూర్తి కాగానే 38 మంది డాక్టర్లు విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సందర్శించారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న 250 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన మంత్రి, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సుమారు 82 కోట్ల రూపాయల వ్యయంతో

2 లో

# బిల్లుల కోసం సచివాలయం ముందు ధర్నాలు

**- ధర్నా చౌక్‌గా మారిన సచివాలయం - చిన్నకంట్రాక్టర్లకు చెల్లింపుల్లో నిర్లక్ష్యం**
**- ప్రజారోగ్యం విస్మరించి..బస్తీదవాఖానలపై నిర్లక్ష్యం - మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు**





(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్,అక్టోబర్ 21 : పరిపాలన కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం కాంగ్రెస్ పాలనలో ధర్నాచౌక్ లా మారిందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మొన్న చిన్న కాంట్రాక్టర్లు సచివాలయం లోపల ధర్నా చేస్తే.. బిల్లులు చెల్లించాలంటూ ప్రభుత్వ అద్దె వాహన యజమానులు సచివాలయం ఎదుట ఆందోళన చేసిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ, అసమర్థ పాలనకు నిదర్శనమిదీ అని అన్నారు. కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్లు, చిరు ఉద్యోగులకు చెల్లించాల్సిన బిల్లులు, జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం శోచనీయమని హరీశ్‌రావు విమర్శించారు. వాహన అద్దె బిల్లులు హైదరాబాద్‌లో 10 నెలలుగా, జిల్లాల్లో 2 సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని అన్నారు. కమీషన్లు ఇవ్వడం లేదని అద్దె వాహనాల బిల్లులు చెల్లించడం లేదా అని నిలదీశారు. యజమానుల కష్టాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే అ÷-దదె వాహనాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే కేసీఆర్‌పై కోపంతో కేసీఆర్ కిట్‌లు తీసేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పేదల ఆరోగ్యంపై రేవంత్‌కు శ్రద్ధ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టిందని మండిపడ్డారు. శేరిలింగంపల్లిలో బస్తీ దవాఖానను హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయి, వైద్య పరికరాలు పనితీరు, వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జీతాలు అందుతున్నాయా అని సిబ్బందిని అడగడంతో.. నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని తమ కష్టాలను హరీశ్ రావుతో చెప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ బస్తీ దవాఖానలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వడం లేదని చెప్పారు. గ్రీన్ చానల్ మాటలకే పరిమితమయిందని విమర్శించారు. ఈహెచ్ఎస్ కింద బకాయిలు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. బిల్లులను పెండింగ్ పెట్టడంతో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. బస్తీ ప్రజలకు తమ గడప దగ్గరే వైద్యం అందించాలనే ఉద్దేశంతో.. నాడు కేసీఆర్ గారు రాష్ట్రం మొత్తంలో 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. వాటిలో 110 రకాల మందులను, 134 రకాల టెస్టులను ఉచితంగా చేసేవారు. కానీ 22 నెలల కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాలకే సుస్తీ పట్టుకున్నది. లింగంపల్లిలో ఉన్న బస్తీ దవాఖానా సిబ్బంది తమకు 5-6 నెలల నుండి జీతాలు రావడం లేదని బాధపడుతున్నారు. నిత్యావసరమైన మందులు కూడా అందుబాటులో లేవు. రేవంత్ ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. సీఎం రేవంత్ రెడ్డి కొత్త వైన్ షాపుల అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాదని విమర్శించారు. దరఖాస్తులు తక్కువ వచ్చాయని వారం రోజులు గడువు పెంచిందని మండిపడ్డారు. మద్యం దుకాణాల మీద, ఆదాయం మీద ధ్యాస తప్ప ప్రజల ఆరోగ్యం శ్రద్ధ లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్ ఎందుకు రావడం లేదని, బస్తీ దవాఖానలో మందులు ఎందుకు లేవని నిలదీశారు. బస్తీ దవాఖానల సిబ్బందికి జీతాలు ఎందుకు వస్తలేవన్నారు. ఒక్కరోజైనా రివ్యూ చేశావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మద్యం దుకాణాల గురించి తప్ప గరీబ్ వాళ్ల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చినంక నల్లా నీళ్ళకు బిల్లులు వేసి పైసలు కట్టాలి అంటున్నరు.

## ఆరోగ్య రంగంలో హుస్నాబాద్ అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

ఆధునాతన సదుపాయాలతో కూడిన 250 పడకల హాస్పటల్ నిర్మాణం జరుగుతోంది. హుస్నాబాద్‌లో నర్సింగ్ కాలేజీ స్థాపనకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 'మహాసముద్రం గండి పనులు టూరిజం అభివృద్ధి కోసం వేగంగా కొనసాగుతున్నాయి. గౌరవెల్లి కాలువల పనులకు భూసేకరణ జరుగుతోంది. రైతులు అందరూ సహకరించాలని కోరుతున్నాను అని తెలిపారు. ఇక మహిళా సంఘాల అభ్యున్నతికి పొన్నం సత్తయ్య ట్రస్టు ద్వారా 13 రకాల వస్తువులతో కూడిన స్టీల్ పాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 'ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, ప్రాజెక్టులు, ఇన్ఫ్రాస్టక్చర్.. అన్ని రంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం' అని మంత్రి స్పష్టం చేశారు.

## ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటాం

మొదటిపేజీ తరువాయి

బోర్డుల నుంచి రూ.24 లక్షల పరిహారం, పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. నిజామాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ హత్య కేసులో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా, అతన్ని పట్టుకునే క్రమంలో మరొక యువకుడు ఆసిఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆసిఫ్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండగా, ఆయన సాహసాన్ని ప్రశంసిస్తూ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మంగళవారం నాంపల్లిలోని మల్లారెడ్డి ఆసుపత్రిలో ఆయనను పరామర్శించారు. ఆసుపత్రిలో ఆసిఫ్‌ను కలసిన డీజీపీ శివధర్‌రెడ్డి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుండి ఆరా తీశారు. డాక్టర్లు వివరించిన ప్రకారం ఆసిఫ్‌పై సర్జరీ పూర్తయిందని, ప్రస్తుతం ఆయన చేతి నరాలను సవ్యంగా కలిపి సాధారణ స్థితికి తీసుకురావడానికి చికిత్స కొనసాగుతున్నదని తెలిపారు. ఆసిఫ్ పరిస్థితి స్థిరంగా ఉందని డీజీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్‌రెడ్డి, ఆసిఫ్ చాలా ధైర్యంగా, నిజమైన పోలీసు స్ఫూర్తితో వ్యవహరించాడు. నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో ఆయన చూపిన సాహసం ప్రశంసనీయం. ఆయన వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. అంతేకాదు, ఆసిఫ్ ధైర్యాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి గ్యాలంట్రీ మెడల్ కోసం సిఫార్సు చేస్తామని తెలిపారు. నిందితుడు రియాజ్ చేసిన దాడిలో ఆసిఫ్ రెండు చేతులకు లోతైన కత్తిగాట్లు అయ్యాయి. చేతి నరాలు కోసుకు పోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. మొదట స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ఆయనను హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం మల్లారెడ్డి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. డాక్టర్లు ఆసిఫ్‌పై సర్జరీ విజయవంతంగా పూర్తయిందని, కొద్ది వారాల్లో ఆయన కోలుకుంటారని తెలిపారు. గత వారం జరిగిన ఈ ఘటనలో రౌడీషీటర్ రియాజ్‌ను నిజామాబాద్ పోలీసులు అక్టోబర్ 17న అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయంలో అతను సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌పై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్ర గాయాల కారణంగా కానిస్టేబుల్ ప్రమోద్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర పోలీస్ శాఖ, నిందితుడిని పట్టుకునేందుకు పెద్ద ఎత్తున దాడులు చేపట్టింది. చివరికి రియాజ్‌ను పట్టుకునే క్రమంలో ఆసిఫ్ ధైర్యంగా ఎదుర్కొని తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం రియాజ్‌ను పట్టుకొని ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రియాజ్ మరోసారి పోలీసులు పై దాడికి పాల్పడి ఆయుధాలు లాక్కునేందుకు యత్నించాడు. ఆత్మరక్షణార్థం పోలీసులు జరిపిన కాల్పుల్లో రియాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన తర్వాత పోలీస్ శాఖలో ఆసిఫ్ సాహసానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఒక సాధారణ వ్యక్తి అయినా పోలీసుల మాదిరిగా ప్రమాదంలో పాల్గొని నిందితుడిని పట్టుకునేందుకు సాహసం చేసినందుకు ఆయనను రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు. డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నట్లుగా, ఆసిఫ్ సాహసాన్ని గుర్తించి గ్యాలంట్రీ అవార్డుకు సిఫార్సు చేయడం ద్వారా ఆయనకు తగిన గౌరవం అందించనున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులు లొంగిపోవాలని ఇప్పటికే సీఎం సూచించారు. తెలంగాణ నుంచి ఇంకా దాదాపు 65 మంది మావోయిస్టులు యాక్టివ్‌గా ఉన్నారు. వారిపై ఉన్న కేసుల విషయంలో సానుభూతితోనే వ్యవహరిస్తాం, ఎలాంటి వేధింపులు ఉండవని డీజీపీ తెలిపారు.

## బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్

మొదటిపేజీ తరువాయి

షేక్‌పేట తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లకు చివరి రోజు కావడంతో అతను నామినేషన్ వేశారు.. మంగళవారం సాయంత్రంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల గడువు ముగిసింది. ఉప ఎన్నికల్లో పోటీకి చివరిరోజులు పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 150కిపైగా నామినేషన్లు దాఖలవగా.. అభ్యర్థుల సంఖ్య 100 మార్క్‌ని దాటింది. మూడు గంటల తర్వాత గేటు లోపల ఉన్న వారికి మాత్రమే అధికారులు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్స్ వేశారు. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఓయూ నిరుద్యోగ వికాస నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల చివరిరోజున బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి సైతం ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్ నామినేషన్లు వేశారు. రేపటి నుంచి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సాయిరాం పరిశీలించనున్నారు. ఇక 24న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుండగా.. 14న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు.

## వేడెక్కిన జూబ్లీహిల్స్ ప్రచారం

మొదటిపేజీ తరువాయి

పలుకుతున్నారని, బీజేపీని ఓడించడమే మజ్లిస్ పార్టీ ప్రధాన లక్ష్యమని సంజయ్ వ్యాఖ్యానించారు. జూబ్లిహిల్స్‌లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయడం లేదు? ఈ రెండు పార్టీలతో చేసుకున్న బేరసారాలే నిదర్శనం అని ఆయన అన్నారు. బీజేపీ గెలిస్తేనే కేంద్ర నిధులతో జూబ్లిహిల్స్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కిషన్ రెడ్డి మరిన్ని నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తారు. కానీ కాంగ్రెస్ గెలిస్తే బంజారాహిల్స్ పెద్దమ్మతల్లి స్థలాన్ని మజ్లిస్‌కు ధారాదత్తం చేసేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారని సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పై కోపంతో బీఆర్ఎస్‌కు ఓటేయడం అంటే రెండు పార్టీలకీ బలమిచ్చినట్లేనని అన్నారు. బీజేపీని గెలిపించండి? ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ చీఫ్ రామచందర్ రావు, గౌతమ్ రావు, పాయల్ శంకర్ తదితర నేతలు హాజరయ్యారు.

## తెలంగాణ రైజింగ్‌కు సలహాలు

మొదటిపేజీ తరువాయి

సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ – 2047 ' సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున వెబ్‌సైట్ లో సందర్శించి ప్రతీ ఒక్కరు తమ సలహాలు సూచనలను అందించాల్సింగా ఒక అధికార ప్రకటనలో తెలియ చేశారు.

## గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో ?

మొదటిపేజీ తరువాయి

పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్ లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. మందులు, పరికరాల పని తీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ దవాఖానలను ప్రారంభించిందని చెప్పారు. 90 శాతం పనులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 10 శాతం పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. బస్తీ దవాఖానలను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా తమకు 4 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాల విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మహిళా డాక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. చిన్నారులకు చా÷-లకెట్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ హయాంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటితో పాటు తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పరీక్షలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేసి, ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించారు. నాలుగు ఐదు నెలలుగా బస్తీ దవాఖానాలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. బస్తీ దవాఖానల్లో మందు గోళీలు కూడా అందుబాటులో లేవన్నారు. ప్రజారోగ్యం అంటే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నదో దీనితో అర్థమవుతుందన్నారు.

# పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా

మొదటిపేజీ తరువాయి

అందించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఇంటిస్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం. ఇటీవల అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని మిగతా మావోయిస్టులనూ కోరుతున్నానని సీఎం తెలిపారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 191 మంది పోలీస్ సిబ్బంది, తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. గ్రేహౌండ్స్ కమాండోలు.. టి. సందీప్, వి.శ్రీధర్, ఎన్. పవన్ కళ్యాణ్‌లు సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందారని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్లాల్, నల్గొండ కానిస్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించారని అన్నారు. మూడు రోజుల కింద నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారని గుర్తుచేశారు. భర్త ప్రమోద్ ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా, అమరుడైన కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ సాలరీతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉ ద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి రూ.16 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ వెల్ఫేర్ నుండి రూ.8 లక్షలు ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. 29-06-2008 న ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33 మంది పోలీస్ కుటుంబాలకు గాజులరామారంలో 200 గజాల స్థలం కేటాయించామన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ అవలంబిస్తున్న విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం మా ప్రభుత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభించిందని ట్ తెలిపారు. అదేవిధంగా, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందిందని చెప్పారు. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనమని చెప్పారు. ఇలాగే, ప్రజల భద్రత, శాంతిని కాపాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలాపాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు రాష్ట్రంలో పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేరం చేసి తప్పించుకోలేమన్న పరిస్థితిని సృష్టించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచిన తెలంగాణ పోలీస్ శాఖను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' వింగ్ సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. డ్రగ్స్ దందా వెనక ఎంతటి వారున్నా వదిలిపెట్టొద్దు అనే ఆదేశాలను జారీ చేశాం. ఒకప్పటితో పోలిస్తే నేరాల స్వభావం మారుతోంది. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, మార్ఫింగ్ కంటెంట్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి.మానవ నేరాలను మించి సైబర్ క్రైమ్ వార్తలు పత్రికల్లో ఎక్కువ కనిపిస్తున్నాయి.టెక్నాలజీ రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు టెక్నాలజీతోనే తెలంగాణ పోలీసులు సమాధానం చెబుతున్న తీరు భేష్.. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేశాం.ఈ విభాగం అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ దేశంలో ది బెస్ట్ గా నిలిచింది.సైబర్ నేరగాళ్ళను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోందని అన్నారు. తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి.కానీ నేడు పోలీస్ శాఖ చర్యల వల్ల శాంతి నెలకొంది.మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకులను జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం మీ అందరికీ తెలుసన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోయి దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపీఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం. విధినిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నాం.మెడికల్ సీట్ల లోను పోలీస్ అమరుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తున్నాం. తీవ్రవాదుల, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్ గ్రేషియాను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలను, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలను, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలను, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయలకు పెంచుతూ మా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.మన ప్రాణానికి వారి ప్రాణాలను అడ్డుపెట్టే పోలీసుల రుణం ఏమిచ్చినా తీరదు.సమాజ శ్రేయస్సే ఊపిరిగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒలంపియన్, బాక్సర్ నిఖత్ జరీన్, వరల్డ్ కప్ విన్నర్ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ కు డీఎస్పీగా ఉద్యోగాలు ఇచ్చి తెలంగాణ పోలీసుల ప్రతిష్టతను పెంచాం. ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అనేవి అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం.ఈ విషయంలో మా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తూ పోలీసు శాఖ మా అందరిలో స్ఫూర్తి నింపుతోంది.సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగిన ఈ కాలంలో పోలీసుల ప్రతి అడుగు, మాట జాగ్రత్తగా ఉండాలి.'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటే చట్టాన్ని గౌరవించే పౌరుల కోసమే,చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల హక్కులను కాపాడుతూ, వారి సమస్యలను తెలియజేసేందుకు చేపట్టే నిరసన కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇస్తూనే, ఈ సందర్భంలో సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎంతో సున్నితంగా వ్యవహరించాలి. సమాజంలో శాంతి భద్రతలను సుస్థిరంగా ఉంచేందుకు పాటుపడే క్రమంలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉ ంటుందన్నారు.



## పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులు

మంథని.అక్టోబర్21(ఆకాంక్ష) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంథనిలో అమరవీరుల స్థూపం దగ్గర మంథని పోలీసులు ఘనంగా నివాళులు అర్పించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ బి రాజు, ఎస్సైలు డేగ రమేష్, సాగర్, ఏఎస్ఐలు మల్లేశం గౌడ్, సుదర్శన్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వే లో అందరూ పాల్గొనాలి

### - ఈనెల 25 తో ముగియనున్న సర్వే...

### - పెద్దపల్లి జిల్లా కలెక్టర్

పెద్దపల్లి,అక్టోబర్21(ఆకాంక్ష): తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ – 2047 సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని ఇప్పటి వరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు.భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం"తెలంగాణ రైజింగ్ – 2047 " సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది.ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీఅందుబాటులోఉన్నందున www.telangana.gov.in /telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## కన్నతల్లిని కత్తితో పొడిచి చంపిన కసాయి కొడుకు-భార్య అరెస్ట్

కదిరి, అక్టోబర్ 20 (ఆకాంక్ష): డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ కసాయి కొడుకు తన భార్యతో కలిసి కన్నతల్లినే కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో చోటుచేసుకుంది. ఈ ఘోర ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.వివరాల్లోకి వెళ్తే కదిరి పట్టణంలోని నిజాంవలి కాలనీలో నివసిస్తున్న ఖాసీమ్–భీ అనే మహిళకు బాబా ఫక్రుద్దీన్ అనే కొడుకు, రసూల్–భీ అనే కోడలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక సమస్యలపై విభేదాలు నెలకొన్నట్లు సమాచారం. తల్లిని తరచూ డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేస్తున్న బాబా ఫక్రుద్దీన్, తల్లి నిరాకరించడంతో కోపోద్రిక్తుడై భార్యతో కలిసి పన్నిన పన్నాగంతో ఈ దారుణానికి పాల్పడ్డాడు.వారం రోజుల క్రితం తల్లి ఇంటికి వెళ్లిన ఫక్రుద్దీన్ దంపతులు కట్టె, కత్తి తీసుకుని ఖాసీమ్–భీపై దాడి చేశారు. అనంతరం ఆమెను అక్కడికక్కడే పొడిచి చంపారు. హత్య అనంతరం మృతదేహాన్ని అక్కడే వదిలేసి, ఇద్దరూ నగదు, మూడు తులాల బంగారం, ఇంటి పత్రాలను సొంతం చేసుకుని పరారయ్యారు.ఈ ఘటనపై మృతురాలి కుమార్తె అమ్మాజాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కదిరి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన పోలీసులు తక్షణమే నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఆధారాల సేకరణలో భాగంగా సీసీ కెమెరా ఫుటేజ్, మొబైల్ లొకేషన్ ఆధారంగా నిందితుల ఉన్నచోటును గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దోచుకున్న మూడు తులాల బంగారం, నగదు, ఇంటి పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ కోర్టులో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల న్యాయ రిమాండ్ విధించింది. కదిరి పట్టణంలో తల్లి హత్య వార్త తెలియగానే స్థానికులు మృదంగమయ్యారు. కన్నతల్లిని హత్య చేసిన క్రూర కొడుకు, అతడి భార్యపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. "జన్మనిచ్చిన తల్లినే డబ్బుల కోసం చంపడం మానవత్వానికి మచ్చ" అంటూ తీవ్రంగా ఖండించారు.ఈ దారుణ ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు కూడా స్పందించారు. ఇలాంటి కుటుంబ హత్యలకు కారణమవుతున్న సామాజిక, ఆర్థిక ఒత్తిళ్లపై సమాజం సజాగ్రత్తగా ఉండాలని, నిందితులపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.కదిరి పోలీసుల వేగవంతమైన చర్యతో నిందితులు శిక్షకు గురయ్యే అవకాశం ఉందని, కేసు విచారణ త్వరితగతిన పూర్తి చేస్తామని సీఐ తెలిపారు.ఈ సంఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర చర్చకు దారితీసింది. కన్నతల్లి ప్రాణాలు తీయడానికి వెనుకాడని కొడుకు, కోడలిపై ప్రజల్లో ఆగ్రహం ఊపందుకుంది.

# వైకుంఠధామానికి ఒర్రె కాలువ అడ్డు

### - వర్షాలొచ్చినప్పుడల్లా నిలిచిపోతున్నా దహన సంస్కారాలు





ఓదెల,అక్టోబర్21(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఇందుర్తి గ్రామంలో ప్రజల అంత్యక్రియల కోసం ఎంతో భక్తి భావంతో నిర్మించిన వైకుంఠధామం ఇప్పుడు ప్రజల కష్టాలకు కారణమవుతోంది. కారణం ఒక్కటే ఆ సమాధి స్థలానికి వెళ్లే దారిలో మధ్యలో ఉన్న ఓర్రె కాలువ. ఆ కాలువపై పైపులు వేయకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే వైకుంఠధామం వైపు అడుగుపెట్టడం కష్టమైపోతోంది.గత ప్రభుత్వ కాలంలో గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి అప్పుడు ఈ వైకుంఠధామం నిర్మించారు. కానీ పనుల నిర్వహణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ కీలకమైన సదుపాయం మరిచిపోయాడు. కాలువ దారిలోనే నిర్మాణం చేసినా, నీరు ప్రవహించే దారిని శాశ్వతంగా సరిచేయడం మరిచిపోయారు. ఫలితంగా వర్షాలు కురిసినప్పుడు కాలువ నిండిపోగా, దహన సంస్కారాలకు వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోతుంది.వర్షాలొస్తే ఒక శవాన్ని కూడా తీసుకెళ్లే దారి ఉండదు. వైకుంఠధామం నిర్మించడమే కాదు, దానికెళ్లే మార్గం కూడా సక్రమంగా ఉండాలని అర్థం చేసుకోవాలి. నీటి లోనైనా వెళ్లి తీరాల్సి వస్తోంది. పెద్దవాళ్లు, మహిళలు, పిల్లలు అందరూ కష్టపడుతున్నారని చెప్పారు.నాడు ఈ కాలువ కాంట్రాక్టర్‌కి కనిపించలేదా? అంత పెద్ద నిర్మాణం చేయడానికి ముందు అక్కడి భూభాగం, నీటి ప్రవాహం, కాలువ మార్గం అన్నీ పరిశీలించాలి కదా. ఇప్పుడు మాత్రం మనమే బాధ పడాల్సి వస్తోందని మండిపడ్డారు.ఇక వర్షాల కారణంగా గత నెలలో రెండు రోజులు వరుసగా వైకుంఠధామం దారిలో చెరువు మత్తడి నీళ్లు ఉండటంతో, గ్రామ ప్రజలు తాత్కాలికంగా చెక్కపాలాలు వేసి దహన సంస్కారాలు నిర్వహించాల్సి వచ్చింది. అప్పుడు అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు సమస్యను ప్రత్యక్షంగా చూశారు గానీ, చర్యలేమీ తీసుకోలేదు.ఇప్పటికైనా గ్రామ ప్రజలు శాశ్వత పరిష్కారం కోరుతున్నారు. "ఓర్రె కాలువపై పైపులు వేసి, సిమెంట్ దారి వేస్తే భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బంది ఉండదు. మేము ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు విజ్ఞప్తి చేస్తున్నాం. అధికారుల దృష్టి ఇప్పటికైనా ఈ వైపు మళ్లాలని గ్రామస్థులు వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.అయితే గ్రామ ప్రజలు మాత్రం వైకుంఠధామం అనేది ప్రతి మనిషి జీవితానికి చివరి దశకు సంబంధించిన పవిత్ర స్థలం. ఆ దారిలో కూడా ఇంత నిర్లక్ష్యం ఉంటే ఆత్మ గౌరవం ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు.ఈ చిన్న కీలకమైన సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని. లేకపోతే ప్రతి వర్షాకాలం వచ్చినప్పుడల్లా వైకుంఠధామం చేరడం కంటే, కష్టాల యాత్రే ఎక్కువగా మారుతోందని చెబుతున్నారు.

# సింగరేణిలో వైద్య సేవల నిర్లక్ష్యం

### - బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్

### - గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో నిర్లక్ష్యం కారణంగా గర్భంలోనే శిశువు మృతి







గోదావరిఖని,అక్టోబర్21(ఆకాంక్ష) : సింగరేణి కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం అందించవలసిన వైద్య సేవలు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాయని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ నిర్లక్ష్యం వలన గర్భంలోనే శిశువు మృతి చెందడం సింగరేణి యాజమాన్యం వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గత రెండు మూడు సంవత్సరాలుగా సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు సరైన వైద్య సదుపాయాలు అందకపోవడంతో సీఐటీయూ పలు సార్లు ఆందోళనలు చేపట్టిందని, సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. ఎల్–వన్ మందులను వాడడం వలన కార్మికులు ఆరోగ్య పరంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు.సింగరేణి యాజ మాన్యం యువ కార్మికులు వస్తున్నారని గొప్పలు చెప్పుకుంటూనే, వారి కుటుంబాలకు కావలసిన గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు అందుబాటులో లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలకు చేయవలసిన స్కానింగ్ వంటి ప్రాథమిక సేవలు కూడా అందించక పోవడం వలన ప్రాణాపాయ పరిస్థితులు నెలకొంటున్నాయని విమర్శించారు.చిన్న తప్పులకే కార్మికులను సస్పెండ్, డిస్మిస్ చేస్తూ ఉండే యాజమాన్యం, వైద్య సేవలలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న బాధ్యులపై మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన అన్నారు. రిఫరల్ తగ్గింపు పేరుతో సరైన పరికరాలు, స్పెషలిస్ట్ డాక్టర్లు లేకుండా కార్మికులను ఆసుపత్రుల్లో రోజులు గడపేలా చేయడం హేయమని పేర్కొన్నారు.అలాగే, రిఫరల్ పంపిస్తున్న కొంతమంది ఆసుపత్రులు కార్మికుల వద్ద నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అలాంటి ఆసుపత్రులను రిఫరల్ జాబితా నుండి తొలగించి, నాణ్యమైన సేవలు అందించే ఆసుపత్రులకు మాత్రమే కార్మికులను పంపాలని డిమాండ్ చేశారు.సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియా ఆసుపత్రుల్లో గర్భిణీ స్త్రీల కోసం స్కానింగ్ యంత్రాలు, నియోనటాలజిస్టులు ఏర్పాటు చేయాలని, ఖ్యాతిలాపు (క్లెయిమ్ సెక్షన్) వ్యవస్థను బలోపేతం చేయాలని కూడా తుమ్మల రాజారెడ్డి సూచించారు. ఈ సమావేశంలో ఆర్జీవన్ అధ్యక్షులు ఆరేపల్లి రాజమౌళి, తోట నరహరిరావు, ఆసరి మహేష్, జంగాపల్లి మల్లేష్, ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.




## యాదవ రాజకీయ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంథని,అక్టోబర్ 21(ఆకాంక్ష) : మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేషం రాజకీయ శిక్షణ శిబిరాన్ని యాదవ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈనెల 24న ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాదవ సంఘాల కన్వీనర్ సౌగాని కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఖాదర్ గూడెంలోని ఫామ్ అరవింద రిసార్ట్లో నిర్వహించే రాజకీయ శిక్షణ శిబిరాన్ని అన్ని పార్టీలకతీతంగా యాదవ సోదరులకు రాజకీయ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు రాజకీయ మెలకువలు నేర్పించనున్నామన్నారు. రాజకీయ శిక్షణ శిబిరాలను మంథని డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల యాదవ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంథని మండల అధ్యక్షుడు పరుషవేని మోహన్ యాదవ్, ఉడుత పర్వతాలు యాదవ్, గోకుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్, కార్యవర్గ సభ్యులు శీలారం పర్వతాలు, కార్యదర్శి ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, మంథని మండల ఉపాధ్యక్షులు కనగంటి ఓదెలు యాదవ్, వేముల లక్ష్మయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెగడ శ్రీనివాస్, కనవేన శ్రీనివాస్ యాదవ్, జాగరి సదానందం యాదవ్, కనవేన కొమురయ్య యాదవ్, కనవేన రమేష్ యాదవ్, మోత్కు రాజబాబు యాదవ్, జక్కుల కుమార్ యాదవ్, మాదరవేన ఓదెలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి

జనగామ టౌన్:అక్టోబర్:21(ఆకాంక్ష న్యూస్) : జనగామ కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తయింది.డిసెంబర్ 1 నుండి 9వ తేదీ వరకు జరిగే ప్రజాపాలన ఉత్సవాల్లో విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు రోడ్లు భవనాల శాఖకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన తరహాలోనే ఈ విగ్రహాన్ని కలెక్టరేట్లో ఏర్పాటు చేయనున్నారు.



## వరంగల్ బీజేపీ నాయకులు పాల్గొన్న సందర్భంగా

హైదరాబాద్,జూబ్లీహిల్స్,అక్టోబర్ 21(ఆకాంక్ష న్యూస్): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో భాగంగా డప్పు చప్పులతో, కళాకారుల నృత్యాలతో, నినాదాల హోరుతో ఘనంగా సాగిన బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గారి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు.

# పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మెడికల్ షాపులు!

## - జనరిక్ మందులు అమ్ముకుంటూ లక్షలు గడుస్తున్న వ్యాపారులు..

## - అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..? ప్రజల ఆరోగ్యంపై బేరమా..?







పెద్దపల్లిటౌన్,అక్టోబర్21(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలో మెడికల్ వ్యాపారం రోజురోజుకీ పుంజుకుంటోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రంతో పాటు వివిధ పట్టణాలు, మండలాల పరిధిలో మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయనే ఆరోపణలు ఊపందుకుంటున్నాయి.



లక్షల్లో పెట్టుబడులు పెట్టి, నెలకు వేలల్లో అద్దెలు చెల్లిస్తూ దుకాణాలు నడిపే మెడికల్ యజమానులు ఎలాంటి లాభాలు ఆర్జిస్తున్నారనే సందేహం ప్రజల్లో నెలకొంది. పెద్దపల్లి జిల్లాలో దాదాపు 650కు పైగా మెడికల్ షాపులు, జిల్లా కేంద్రంలో సుమారు 75 మెడికల్ స్టోర్లు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వీటిలో చాలామంది వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా, ఒరిజినల్ మందులకు బదులు జనరిక్ మెడిసిన్ విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. జనరిక్ మందులు సాధారణంగా తక్కువ ధరకే అందుబాటులో ఉన్నా, వాటిని అధిక ధరలకు విక్రయిస్తూ కొందరు వ్యాపారులు వందకు వంద శాతం లాభాలు ఆర్జిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కస్టమర్లను ఆకర్షించడానికి 10 నుండి 20 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నామని చెబుతున్నా, వాస్తవానికి తక్కువ నాణ్యత గల మందులు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు అనుమానం రాకుండా ప్యాకేజింగ్, డిజైన్, లేబుల్స్ మారుస్తూ ఒరిజినల్ మందుల ముసుగులో జనరిక్ మందులు విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు మరింత బలపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో డ్రగ్ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మెడికల్ షాపులు ఆడేది ఆటగా, పాడిందే పాటగా నడుస్తున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజల ఆరోగ్యమే ప్రమాదంలో పడుతోందని స్థానిక వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కొంత మంది మెడికల్ యజమానులు తమ దుకాణాలను సూపర్ మార్కెట్ తరహాలో ముస్తాబు చేసి, బ్యూటీ ప్రోడక్ట్స్ నుండి బేబీ కేర్ వస్తువుల వరకు విక్రయిస్తూ ఆదాయ మార్గాలను విస్తరిస్తున్నారని తెలుస్తోంది. కానీ ప్రధానంగా మందుల విక్రయంలో నైతికత పాటించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని మెడికల్ షాపులన్నింటినీ క్రమపరచి, వారి లైసెన్స్‌లు, బిల్లింగ్ వ్యవస్థ, మందుల నిల్వ స్థితి తదితర అంశాలపై సమగ్ర తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకన్నా లాభాలు ముఖ్యం కాదు. వైద్య రంగంలో ఇలాంటి నిర్లక్ష్యం అసహ్యాకరమైందని వైద్య వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. ఇక అధికారులు ఈ అంశంపై స్పందించాల్సిన సమయం ఆసన్నమైందని పౌర సంఘాలు హెచ్చరిస్తున్నాయి. మందుల మార్కెట్లో వ్యాపారులు, డీలర్లు కలిసి ధరలను నిర్ణయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, దీనిపై జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలోని ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే, మెడికల్ షాపుల వద్ద కొనుగోలు చేసే మందుల బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని, ప్యాకేజింగ్, తయారీ సంస్థ వివరాలు పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేసే మెడికల్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ మరింత ఊపందుకుంటోందని మందుల పేరుతో మోసం %-% ఆరోగ్యమే బలి!" అంటూ జిల్లా వ్యాప్తంగా వినియోగదారుల ఆగ్రహం ఉధృతమవుతోంది.

**జనరిక్ మందులు విక్రయించడం తప్పే....**

**వినియోగదారులు తమ దృష్టికి తీసుక వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం...**

**పెద్దపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ శ్రవణ్...**

ఈ నేపథ్యంలో పెద్దపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ శ్రవణ్‌ను "ఆకాంక్ష" ప్రతినిధి సంప్రదించగా, ఆయన మాట్లాడుతూ.... ఒరిజినల్ మందులకు బదులుగా జనరిక్ మందులు విక్రయించడం తప్పే. ఈ విషయంలో వినియోగదారులు తమ దృష్టికి తీసుకురాగానే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరికైనా ఇలాంటి అనుమానాలు ఉంటే 8333818142 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



# జాతిని జాగృతం చేసే పండుగ దీపావళి

## - సమాజ సేవకులు... పులి రాజశేఖర్

సంగెం, అక్టోబర్ 21,(ఆకాంక్ష న్యూస్): నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళిని చేసుకుంటారు. చీకటి పార ద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగ , విజయానికి ప్రతికంగా దీపావళి పండుగ జరుపుకుంటారని సమాజ సేవకులు పులి రాజశేఖర్ అన్నారు. గత 9 సంవత్సరాలనుండి సంగెం మండలం లో చుట్టుపక్క గ్రామాల భక్తులకు దీపావళి పర్వదినం సందర్భంగా కేదారేశ్వర నోములు నోముకునే వారికి ఉచితంగా ఆవు పాలు, పేడ, పంచకం, అందజేయడం జరిగిందని, ఈ సంవత్సరం నోములు నోముకునే 303 కుటుంబలకు ఉచితంగా ఆవు పాలు, పేడ, పంచకం, అందించామని పులి రాజశేఖర్ తెలిపారు. ఇంతటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పులి రాజశేఖర్ ను ప్రజలు అభినందించిన్నారు.

# హెచ్-1బి వీసా విషయంలో విదేశీ విద్యార్థులకు భారీ ఊరట




హైదరాబాద్, అక్టోబర్ 21 (ఆకాంక్ష న్యూస్): హెచ్-1బి వీసా కోసం భారీ ఫీజు చెల్లింపు విషయంలో విదేశీ విద్యార్థులకు ఊరట లభించింది. అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ తాజాగా విడుదల చేసిన ప్రకటనలో, లక్ష డాలర్ల (దాదాపు రూ. 88 లక్షలు) కొత్త ఫీజు అమెరికా బయట నుంచి దరఖాస్తు చేసే పిటిషన్లకే వర్తిస్తుందని స్పష్టం చేసింది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న విదేశీ విద్యార్థులు (ఉదా: హెచ్-1 వీసాపై ఉండి హెచ్-1బి కి మారేవారు) ఈ ఫీజు నుంచి మినహాయింపునకు అర్హులు. కొత్త ఫీజు 2025 సెప్టెంబర్ 21 నుంచి అమలులోకి వచ్చింది. ఇది ఒకసారే చెల్లించాల్సిన ఫీజు, ప్రతి సంవత్సరం కాదు. ఈ నిర్ణయం అమెరికాలో ఉన్న భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు తాత్కాలిక ఊరటను అందించింది.

# పాలకుర్తి మండలంలో రైతులకు విత్తనాల పంపిణీ

## - రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




జనగామ జిల్లా /పాలకుర్తి అక్టోబర్, 21(ఆకాంక్ష న్యూస్) : పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి మండల కేంద్రంలో రైతు వేదిక ప్రాంగణంలో జాతీయ స్థాయిలో అమలు అవుతున్న జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్ (ప్యాడీ) మరియు జాతీయ నూనెగింజల మిషన్ (గ్రౌండ్‌నట్) కార్యక్రమాల కింద రైతులకు విత్తనాలను పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారు, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షైక్ గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రైతు దేశానికి వెన్నెముక. రైతు బలంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. అందుకే ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు మద్దతుగా నిలుస్తోంది," అని వారు పేర్కొన్నారు. రైతులు పండించే ప్రతి గింజకు విలువ దక్కేలా చర్యలు తీసుకుంటామని యశస్విని రెడ్డి గారు హామీ ఇచ్చారు. నాణ్యమైన విత్తనాల పంపిణీతో పాటు వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా దిగుబడులు పెంచడం లక్ష్యమని తెలిపారు. అలాగే రైతులు ఈ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, మద్దతు ధరలు, మరియు సాంకేతిక సాయం ద్వారా తమ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి రైతు సంతోషంగా, స్వావలంబిగా ఉండడం నా లక్ష్యం. రైతులకు అవసరమైన సహకారం అందించడానికి ఎల్లప్పుడూ నేను ముందుంటాను. రైతు కష్టానికి గౌరవం దక్కేలా కృషి చేస్తాం," అని అన్నారు. ఈ కార్యక్రమంలో %సూవీజ% చైర్మన్ లవుడ్యా మంజుల భాస్కర్, బ్లాక్ మరియు మండల అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు నాగన్న, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ సభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు..

# అమీర్పేట్ లో.. డ్రైనేజ్ సమస్యను పార్శీలించిన సిహెచ్ యాదయ్య

## - ప్రతి వార్డులో డ్రైన సమస్య లేకుండా చూడండి

## - మహేశ్వరం నియోజకవర్గము మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య




రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం , అక్టోబర్ 21 (ఆకాంక్ష న్యూస్): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని అమీర్పేట్ గ్రామంలో.. మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి వార్డులో డ్రైనేజ్ సమస్య పరిశీలించడం జరిగింది వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు తెలియజేశారు వార్డులో ఏ సమస్య ఉన్న నా వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్ మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్ అమీర్పేట్ గ్రామ శాఖ అధ్యక్షులు రాజేందర్ మరియు అమీర్పేట గ్రామస్తులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

## -కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

## -వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్



జనగాం, రఘునాథపల్లి అక్టోబర్ 21(ఆకాంక్ష న్యూస్) : రఘునాథపల్లి మండల కేంద్రంలోని పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించిన జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో పోరాడి మృతి చెందిన పోలీస్ అమరవీరుల సేవలు మరువలేనివని నేటితరం వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ రౌడీ షీటర్ చేతిలో చనిపోవడంపై పోలీస్ సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు. మంగళవారం నుండి 31 వరకు పోలీసు అమరుల దినోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసిపిలు ఐపీఎస్ పండరి చేతన్ కుమార్, అంబటి నరసయ్య భీమ్ శర్మ , సిఐలు ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి, జానకిరామ్ రెడ్డి, శ్రీనివాసరావు, అబ్బయ్య, సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐలు నరేష్, వినయ్ కుమార్, శ్రవణ్, భరత్, రామారావు, నవీన్, హమీద్, చెన్నకేశవులు, రాజేష్ కుమార్, నగేష్, సాయిబాబు, రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సొంత పార్టీ ఎమ్మెల్యే అయిన ఊరుకునేది లేదు

## - రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదు - పిఎస్సిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ - సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఉద్రిక్తత..

## - ఎమ్మెల్యే ఆగ్రహం





జనగామ జిల్లా /పాలకుర్తి నియోజకవర్గం,దేవరుప్పుల అక్టోబర్ ,21 (ఆకాంక్ష న్యూస్) : పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండల కేంద్రంలో రైతు వేదిక కేంద్రం వద్ద మంగళవారం రోజున జరిగిన సబ్సిడీ విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి మాట్లాడుతూ అభివృద్ధికి సంబంధించిన ఏ కార్యక్రమంకు అయినా సహకరిస్తామని,పర్యావరణం కు సంబంధించి ఏదైనా సహజ సంపదను తరలించే ప్రయత్నం ఏదైనా ఉంటే మానుకోవాలని,రైతులకు అన్యాయం జరిగే విధంగా ఏదైనా కార్యక్రమాలు చేపడితే దేవరుప్పుల ప్రాంతం పోరాటాల గడ్డ అని సొంత పార్టీ ఎమ్మెల్యే అయిన ఊరుకునేది లేదని చెప్పడంతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ప్రసంగం ను మధ్యలో అడ్డుకున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ,పెద్ద కృష్ణమూర్తి గౌడ్ వర్గాల మధ్య ఘర్షణ నెలకొన్నది. సొంత పార్టీ నేతలు ఇలా బహిరంగంగా విమర్శలు చేసుకోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పెద్ది కృష్ణమూర్తి గౌడ్ వర్గముకు ఎమ్మెల్యే వర్గం కు గత కొద్దికాలం నుండి వర్గపోరు జరుగుతుంది.

## ములుగు జిల్లా,వాజేడు మండలం,టేకులగూడెం ఏరియాలో ఇసుక క్వారీలో

# జరుగుతున్న మాఫియా

## - వరుస కథనాలు నిత్యం నిఘా పత్రికలో చూసి స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం

## - లోడింగ్ కు డబ్బులు మరల వసూలు చేసినట్టు అయితే క్వారీ సీజ్ చేస్తాం

## - వాజేడు మండలం తహసీల్దార్ శ్రీనివాస్





ములుగు జిల్లా,వాజేడు ,అక్టోబర్ 21(ఆకాంక్ష న్యూస్): టేకులగూడెం ఇసుక క్వారీనీ వాజేడు మండలం తహసీల్దార్ శ్రీనివాస్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ కుమారస్వామి శనివారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు.క్వారీలో రేజింగ్ నిర్వాహకులు లారీ డ్రైవర్ల దగ్గర 4000 రూపాయలు వసూలు చేయడంతో లారీ డ్రైవర్లు వాజేడు మండలం తహసీల్దార్ శ్రీనివాస్ కు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ కుమారస్వామికి డ్రైవర్లు తెలపడంతో లోడింగ్ చేపిస్తున్న వ్యక్తినీ ఎంత వసూలు చేసావని 4000 రూపాయలు ఎందుకు వసూలు చేసావని గట్టిగ నీలాదియడంతో వసూలు చేసిన డబ్బులను లోడింగ్ చేసుకున్న లారీల డ్రైవర్లకు తహసీల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ డబ్బులు ఇప్పించారు.రెవిన్యూ అధికారులు టిఎస్ఎండిసి ఎంప్లాయిస్ ను లోడింగ్ కు డబ్బులు తీసుకుంటుంటే టిఎస్ఎండిసి ఎంప్లాయిస్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించగా లోడింగ్ కు డబ్బులు విన్వవద్దని చెప్పిన వారు నిర్వాహకులకు ఇస్తున్నారని తెలిపారు.లారీ డ్రైవర్లకు తాగడానికి నీళు ఏర్పాటు ఎందుకు చేయడం లేదని, నీళ్లు లారీల డ్రైవర్లకు అందించాలని అదేశించారు. సొసైటీ సభ్యులతో తహసీల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ లోడింగ్ చేయు దగ్గర ఉండాలనీ తెలిపారు.లోడింగ్ అయినా లారీలను పార్కింగ్ స్థలంలో నిలుపుదల చేయాలనీ రెవిన్యూ అధికారులు ఏచ్చరించారు.జాతీయ రహదారి పై లారీల నిలుపుదల చేయడంతో నేషనల్ హైవే ధ్వసం అవుతుంది అని ఎచ్చరించారు.క్వారిని తనిఖీ చేయు సమయంలో పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్,కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ బాబు,కాంగ్రెస్ నాయకులు పూనెం రాంబాబు,కామ్యూనిస్ట్ పార్టీ దాబ్బాకట్ల లక్ష్మయ్య సమక్షంలో నిబంధనలకు విరుద్ధంగా మరల ఇసుక లోడింగ్ కు లారీ డ్రైవర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తే ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం ఇసుక క్వారీనీ సీజ్ చేస్తామని ఏచ్చరించారు.

## మాస్టర్ వెనిగండ్ల పృద్వి పుట్టినరోజు సందర్భంగా

# గుడివాడ లో వెనిగండ్ల కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ప్రారంభం

## -మంచి ఆలోచనతో కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ఏర్పాటు చేయడం అభినందనీయం


## -రాజకీయ పట్టణ ప్రముఖులు

గుడివాడ , (ఆకాంక్ష న్యూస్): గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు రామకృష్ణ కుమారుడు పృథ్వి పుట్టినరోజు సందర్భంగా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వద్ద వెనిగండ్ల కమ్యూ నిటీ ఫ్రిడ్జ్ ను ఏర్పాటు చేశారు. మాస్టర్ పృథ్వితో కలిసి స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ను ప్రారంభించారు.

ఫ్రిడ్జ్ ద్వారా పేదలకు కలిగే ప్రయోజనాలను, ఫ్రిడ్జ్ లో ఎటువంటి ఆహారాన్ని ఉంచాలి అన్న అంశాలను ఈ సందర్భంగా మాస్టర్ పృద్వి రాజకీయ ప్రముఖులకు మరియు అధికార, పట్టణ ప్రముఖులకు వివరించారు. అనంతరం స్టేడియం కమిటీ సిబ్బందికి పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేసిన పృద్వి క్రీడాకారులు,చిన్నారులకు చాక్లెట్లు ఇచ్చారు.ఈ సందర్భంగా కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు , జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కమిషనర్ సింహాద్రి మనోహర్, టూ టౌన్ సీఐ హనీష్, తదితర ప్రముఖులు మీడియాతో మాట్లాడారు. చిన్న వయసులోనే మంచి ఆలోచనతో కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ఏర్పాటుకు నాంది పలికిన వెనిగండ్ల పృద్విని అభినందించారు. నిత్య జీవితంలో మనం వృధా చేసే ఆహారాన్ని పదిమందికి ఉపయోగపడేలా కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు తినడానికి ఉపయోగపడే ఆహారాన్ని ఫ్రిజ్లో పెట్టాలని సూచించారు.

# పాఠ్య పుస్తకాల పంపిణీ





ములుగు జిల్లా,వాజేడు/ టేకులగూడెం,అక్టోబర్ 21 (ఆకాంక్ష న్యూస్): వాజేడు మండల విద్యా వనరుల కేంద్రం నందు ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు పార్ట్ 2 వివిధ పాఠశాలను వాజేడు మండల విద్య శాఖ అధికారి తెజోవత్ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. అలాగే ఉల్లాస్ మెటీరియల్ ను సెర్ప్ ఏపీఎం సహకారంతో వాలంటీర్లకు సంబంధించిన మార్గదర్శిని, బ్రౌజర్స్, లెర్నర్స్ కు సంబంధించిన అక్షర వికాసం పుస్తకాలను పంపిణీ చేయడం జరిగినది.

# కేజీవీబీని సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్





జనగాం, రఘునాథపల్లి, అక్టోబర్ 21 (ఆకాంక్ష న్యూస్) : రఘునాథపల్లి మండలంలో నిఖిలాషాపురం కేజీబీవీ ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా స్టాఫ్ రిజిస్టర్ ని కలెక్టర్ పరిశీలించి ఈరోజు అటెండ్ అయిన టీచర్ల గురించి, సెలవు పెట్టిన వారి గురించి వివరాలను స్పెషల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు అనంతరం కిచెన్ లోకి వెళ్లి వంట సరుకుల నాణ్యతను పరిశీలించారు. తాజా కూరగాయలను మాత్రమే వాడాలని, అన్ని సరుకులు తగు పరిమాణం లో ఉండాలని సూచించారు. మెనూ ప్రకారం భోజన తయారీ ఉండాలన్నారు.దిక్సూచి కార్యక్రమంలో లో భాగంగా రెసిడెన్షియల్ విద్యార్థులకు ఇచ్చిన హెల్త్ కార్డులో నమోదు చేసిన పరీక్షలకు అనుగుణంగా జరుగుతున్న హెల్త్ క్యాంప్ ను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమంది విద్యార్థులకు పరీక్షలు జరిగాయని అడిగి... వాటికి సంబంధించిన రిపోర్ట్ లను కలెక్టర్ పరిశీలించారు.స్థానికంగా ఆసుపత్రి లో మెడికల్ అధికారులు అందుబాటులో ఉంటున్నారా... విద్యార్థులకు కావలసిన టాబ్లెట్లను ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.పదవ తరగతి క్లాస్ లోకి వెళ్లి... విద్యార్థుల తో పలు అంశాల మీద కలెక్టర్ మాట్లాడారు ఇప్పటి వరకు జరిగిన సిలబస్ గురించి, వివిధ టెస్ట్ ల్లో వచ్చిన మార్కు లను, ఏ విద్యార్థి ఏ సబ్జెక్ట్ లో వీక్ గా ఉన్నారు మొదలగు అంశాల మీద కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికిషోర్, కేజీవీబీ హేమ లత పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన వర్ధన్నపేట పోలీసులు

## - దేశం కోసం సమాజం కోసం పోలీసులు చేస్తున్న నిస్వార్థ సేవను,అత్యున్నత త్యాగాన్ని గుర్తుచేసుకున్న ప్రజలు






వరంగల్/వర్ధన్నపేట/అక్టోబర్ 21(ఆకాంక్ష న్యూస్) :వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో వర్ధన్నపేట పోలీస్ వారి ఆధ్వర్యంలో అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, వివేకానంద విగ్రహం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఏసీపీ అంబటి నర్సయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణలను సైతం లెక్కచేయకుండా ప్రజలకోసం పోరాటం చేసి అమరులైన పోలీస్ అమరవీరుల ను గుర్తుచేసుకొని క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం,అందులో భాగస్వాములైన వివిధ సంఘాల నాయకులు,రాజకీయ పార్టీ నేతలు,విద్యార్థిలు పాల్గొని పోలీస్ అమరవీరులను గుర్తుచేసుకోవడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో సి.ఐ, శ్రీనివాస్, ఎస్.ఐ లు సాయిబాబు,రాజు,సిబ్బంది దామోదర్, యాకూబ్ పాషా,అజయ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు...




# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం : ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

### - ప్రశాంత వాతావరణానికి కారణం ఒకప్పటి అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే

(ఆకాంక్ష న్యూస్)

ఆదిలాబాద్, అక్టోబర్ 21 : శాంతి భద్రతల పరిరక్షణ కోసం అలాగే దేశ సరిహద్దులో రక్షణ కోసం విది నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం మంగళవారం జిల్లాలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో గల అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ అమరవీరుల స్తూపం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమరులైన పోలీసుల ముఖ చిత్రాలతో ఏర్పాటు చేయడం తెలంగాణలోనే ప్రధమంగా ఉండటం విశేషం. స్తూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్చాలతో స్తూపం వద్ద నివాళులర్పించడం జరిగింది. జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే సందర్భంగా భారీ ఏర్పాట్ల మధ్య అమరవీరులను మనస్ఫూర్తిగా స్మరించుకోవడం జరిగింది. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం, దేశ రక్షణలో విధి నిర్వహణమే ముఖ్యంగా అసువులు బాసిన 191 మంది పోలీసు సిబ్బంది, అధికారుల పేర్లను అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్రావు చదువుతూ స్మరించుకోవడం జరిగింది. మొదటగా ఉన్నతాధికారులు అందరూ కలిసి స్తూపం వద్ద జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు అమరవీరులకు సలామి శస్త్ర ద్వారా గౌరవ వందనాన్ని సమర్పించి, ఆయుధాలను తలకిందులుగా చేసి శోక్ శస్త్ర శ్రద్ధాంజలి ఘటించి, ద్వారా రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు. తర్వాత అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించే దిశగా జిల్లా పరిపాలన, పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తాందని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఒక పోలీసు వ్యవస్థనే ఇతరుల కోసం ప్రాణాలను సైతం అర్పిస్తుందని తెలియజేశారు. పోలీసులు నిస్వార్ధమైన సేవలను అందిస్తారని వారికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి సంవత్సరం అమరవీరులను స్మరించుకుంటూ వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయాలని వారి కుటుంబ సభ్యులను సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని తెలియజేశారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ మాట్లాడుతూ అక్టోబర్ 21న ప్రతి సంవత్సరం జరుపుకునే అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) 65 సంవత్సరాల క్రితం లడక్ సమీపంలో భారత సరిహద్దుల్లో పహారకాస్తున్న మన పోలీసు సిబ్బందిపై చైనీయులు దాడి చేశారని, ఈ ప్రదేశాన్ని హార్ట్ స్ప్రింగ్ గా పేర్కొంటారని,1959 అక్టోబర్ 21న ఆ సమయంలో విది నిర్వహణలో వీరోచితంగా పోరాడి చేయనీయుల చేతులు అసువులు బాసిన పదిమంది సిఆర్పిఎఫ్ జవాన్ల వీరమరణం సందర్భంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా ఫ్లాగ్ డే దినోత్సవాన్ని అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారి సంస్మరణ ఆదిలాబాద్ జిల్లా నందు పది రోజులపాటు, ప్రజా హిత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా నార్త్ తెలంగాణ లోని ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు సంఘవిద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయం గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నందు 50 మంది పోలీసు అధికారులు సిబ్బంది సంఘవిద్రోహశక్తులతో ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది యొక్క కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ ఎలాంటి అవసరాలైన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. అసువులు బాసిన పోలీసు ప్రతి ఒక్కరి స్ఫూర్తి బాటలో జిల్లా పోలీసు యంత్రాంగం కొనసాగుతుందని తెలియజేశారు. జిల్లాలోని అమరవీరులను, వారి త్యాగాలను స్మరించడానికి రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జిల్లా హెడ్ క్వార్టర్స్ నందు వారి ముఖ చిత్రాలతో అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు అదనపు ఎస్పి ఆపరేషన్ బి సురేందర్ రావు,డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, కమతం ఇంద్ర వర్ధన్, డిఎంహెచ్వో నరేంద్ర రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, ఆర్టీసీ ఆర్ఎం భవాని ప్రసాద్, రెండవ బెటాలియన్ అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# దేశ సరిహద్దులో సైనికుడు-రాష్ట్ర భద్రతలో పోలీస్ ... ఇద్దరిదీ ఒకే త్యాగ పథం !

### - "ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని వుండే ఒకే ఒక్క వ్యక్తి పోలీస్"
### - పోలీస్ అమరవీరులను స్మరిస్తూ జ్యోతి ప్రజ్వలనం, శ్రద్ధాంజలి"
### - పోలీస్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి - జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

(ఆకాంక్ష న్యూస్)

నిర్మల్ అక్టోబర్ 21 : ప్రపంచమంతా నిద్రపోయినా మేల్కొని వుండే ఒకే ఒక్క వ్యక్తి పోలీస్ అని పోలీస్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల దినం సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల వారోత్సవాల కార్యక్రమానికి లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, అమరవీరులకు ఘన నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత కీలకమో, రాష్ట్ర భద్రతలో పోలీసు కూడా అంతే కీలకమని అన్నారు. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజా అవసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతి భద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అక్టోబర్ 21 ప్రాముఖ్యతను వివరిస్తూ, 1959 చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్ధంగా తిప్పిగొట్టిన రోజు ఇది. ఈ సమరంలో కొంత మంది పోలీసు లు అమరులయ్యారు.విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుందాం. దేశ సరిహద్దుల్లో సైనికులు అమరులైన రోజు ఇది. 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సిఆర్పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. వారి స్మృతి చిహ్నంగా జరుపుకుంటున్నదే అమరవీరుల దినం.వీరమరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమాన్ని మరియు వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలను సర్వస్వం లభింపచేయడం, ఆయా కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీసు అమర వీరులకు మనం అందించే నిజమైన నివాళి. పోలీసు విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నది, ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదు, ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఒక్క పోలీసు ఉద్యోగమే, పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేము, ప్రతి ఒక్కరు ఏ ఆపదకైనా ఆశ్రయించేది పోలీసులనే, ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసే, అన్ని పరిస్థితుల్లో అన్ని వేళల్లో పోలీసులే ముందుంటారు, దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు అని అన్నారు.శాంతిభద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్ళను నియంత్రించడం పోలీసు కర్తవ్యం, అంతర్గత భద్రతను కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు.ఈ సందర్భంగా త్యాగమూర్తుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు వారి యొక్క సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాద్యమైన%శీ%త త్వరగా పరిష్కరిస్తాము అని తెలిపారు.అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించారు. అనంతరం పోలీసు వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీస్ అమరవీరులకు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఒక్కొక్కరిగా వచ్చి అందరూ అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించారు.ఈ సంవత్సరం అమరులైన వారి పేర్లను/ రోల్ ఆఫ్ హానర్ ను అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి చదివారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా జి.జానకి షర్మిల తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐ లు, ఆర్.ఎస్ఐ లు, డీపీఓ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డెన్ ను వేధింపులు గురిచేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

### - వసతి గృహాల సంక్షేమ అధికారుల సమస్యలు పరిష్కరించాలి
### - టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి

(ఆకాంక్ష న్యూస్)

మంచిర్యాల, అక్టోబర్ 21 : జిల్లాలోని లక్షెట్టిపేట ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ రాజగోపాల్ ను వేధింపులకు చేసిన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో టీఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా వసతి గృహాల సంక్షేమ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుటకు సహకరించాలని కోరుతూ జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు దుర్గాప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ, హాస్టల్ పిల్లల సంక్షేమం కోసం ఖర్చుపెట్టిన బిల్లులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా వ్యక్తిగతంగా అవమానపరుస్తూ, తీవ్రంగా మనోవేదన గురిచేయగా, అధికారుల వేధింపులు తట్టుకోలేక రాజగోపాల్ శనివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. దీనిపై వెంటనే విచారణ నిర్వహించి, హాస్టల్ వార్డెన్ రాజగోపాల్ కు న్యాయం చేయాలని, అదేవిధంగా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సానుకూలంగా స్పందిస్తూ, పూర్తి విచారణ నిర్వహించి, బాధ్యులపై



చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ యూనియన్ జిల్లా కోశాధికారి ఏ సతీష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రామ్ కుమార్, తిరుపతి, జాయింట్ కార్యదర్శి సురేందర్, పబ్లిక్ కార్యదర్శి యూసుఫ్, రాజేందర్, మంచిర్యాల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, అజయ్ ప్రశాంత్, విజయ, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు గంగారం, సుజిత్ రావు, జిల్లా వసతి గృహాల సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు మోహిస్సిన్, కార్యవర్గ సభ్యులు ధర్మానంద్ గౌడ్, కుమార్, సునీత, కిషోర్, సుభద్ర, సుధాలక్ష్మీ, జయశంకర్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.




# జూబ్లీహిల్స్ ఉప న్నికల్లో బిఆర్ఎస్ గెలుపు తధ్యం

### - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
### - తన అనుచరులతో కలిసి కొప్పుల ఇంటింటి ప్రచారం

(ఆకాంక్ష న్యూస్)

ధర్మపురి, అక్టోబర్ 21 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు తథ్యమని ధర్మపురి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మాగంటి సునీతకు మద్దతుగా సోమవారం తన అనుచరులతో కలిసి జూబ్లీహిల్స్ నియోజక వర్గం లోని షేక్ పేట డివిజన్ 1 లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా మాగంటి సునీత ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేయాలని కొప్పుల ఈశ్వర్ ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని అటకెక్కించి సబ్బండ వర్గాల ప్రజలను అష్ట కష్టాల పాలు చేస్తుందని ఓటర్లకు వివరించారు. మాగంటి సునీతను గెలిపించి కాంగ్రెస్ పార్టీ అహంకారాన్ని అనగదొక్కాలని ఇంటింటా తిరుగుతూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కొప్పుల వెంట ధర్మపురి నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యాల బలరాం రెడ్డి, జూపాక కుమార్, మూగల సత్యం, ఎండి. రియాజ్ పాల్గొన్నారు.

# విద్య, ఉపాధి రంగాలపై ప్రత్యేక దృష్టి

### - ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరు
### - రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

(ఆకాంక్ష న్యూస్)



ధర్మపురి, అక్టోబర్ 21 : ధర్మపురి నియోజకవర్గంలో విద్యాభివృద్ధి, ఉపాధి రంగాల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా సోమవారం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ధర్మపురి ప్రజలకు నేడు అసలైన దీపావళి పండుగ అని, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిగ్రీ కళాశాల మంజూరు కావడం హర్షించదగ్గ విషయమన్నారు.ఇకపై ధర్మపురి యువత ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పనిలేదని మంత్రి పేర్కొన్నారు. ఇదివరకే ధర్మారం మండలంలో ఐటీఐ కళాశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించామని,నేరెళ్ల గ్రామం లో సుమారుగా 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్ట బోతున్నామని, ధర్మపురిలో శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాలను పునఃప్రారంభించామని తెలియజేశారు. అంతే కాకుండా అదనంగా, ధర్మపురి ప్రాంత యువతను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడానికి యూత్ ట్రైనింగ్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, ఇ-క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ధర్మపురిలో డిగ్రీ కళాశాల మంజూరు కు కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కు అడ్లూరి ధన్యవాదాలు తెలిపారు.



# పోలీసుల సేవలు త్యాగాలు మరువలేనివి

### - మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య

(ఆకాంక్ష న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 21 : పోలీసుల అమరవీరుల సంస్కరణ దినోత్సవం సంద ర్భంగా భూపాలపల్లి జిల్లా కేం ద్రంలో పోలీస్ శాఖ వారి ఆధ్వ ర్యంలో రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ అమరులు అయినా పోలీసులకు నివాళులు అర్పిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తూ ప్రజాస్వామ్య రక్షణ కోసం అంకిత భావంతో పనిచేస్తూ విధినిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసుల త్యాగం వెలకట్టలేనిది అని అన్నారు. రక్త దానం అనేది ప్రాణదానం లాంటిది అని అన్నారు. పేషంట్లకు అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉంటే ఎట్టి పరిస్థితులలో అయినా రక్త దానం చేసి ప్రాణాన్ని నిలబెట్ట వచ్చునని ఈ సందర్బంగా మాట్లాడారు.



# మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసినదుండగులను కటినంగా శిక్షించాలి

### - జాతీయ బీసీ సంక్షేమ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా
### - వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టిపాముల బాబురావు

(ఆకాంక్ష న్యూస్)

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 21 : వరంగల్ జిల్లాలోని కరీమాబాద్ ఉర్సు దర్గా వద్ద ఆటోస్టాండ్ దగ్గర ఉన్నటువంటి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే గారి విగ్రహంను ద్వంసం చేసిన దుండగుల పై కఠిన చర్యలు తీసుకోవాలని గొట్టిపాములు బాబురావు పోత్నక్ ప్రమోద్ కుమార్ మాటూరి అశోక్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొప్ప వ్యక్తుల విగ్రహాలను ద్వంసం చేసేన వారి పైన పిడి యాక్ట్ నమోదు చేయాలనీ మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు వెంటనే మరో పూలే విగ్రహంను ఏర్పాటు చేయాలనీ అధికారులను పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ పున రావృతం కాకుండా కుండా పోలీస్ అధికారాలు కఠినమైన చర్యలు చేపట్టాలన్నారు లేని పక్షంలో బీసీలతో కలిసి పెద్ద ఎత్తున చలో కరీమాబాద్ ప్రోగ్రాం చేపడతామని హెచ్చరించారు.

# ఆరోగ్యం



## ఓట్స్ అధికంగా తింటే అనర్థాలు.. జాగ్రత్త!

ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు.

**అతిగా ఓట్స్ తింటే అనర్థాలు**

ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం.ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి.

**అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు**

ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది.

**ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్**

ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

## పాలక్ కోకోనట్ రైస్..తక్కువ టైంలో ఎక్కువ రుచి..ఎలా చేసుకోవాలంటే






పాలక్ కోకోనట్ రైస్ రైస్ ఒక సుగంధభరితమైన, రుచికరమైన వంటకం. ఇది పాలకూర, కొబ్బరి పాల కలయికతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది లంచ్ బాక్స్ ల్లోకి, తేలికపాటి భోజనానికి లేదా ప్రత్యేక సందర్భాలలో వడ్డించడానికి కూడా చాలా బాగుంటుంది. దీనిని తయారు చేయడం చాలా సులభం, తక్కువ సమయంలోనే సిద్ధం చేసుకోవచ్చు. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 2 కప్పులు -పాలకూర - 2 కప్పులు -కొబ్బరి పాలు - 1.5 కప్పులు -ఉల్లిపాయ - 1 పెద్దది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్ -ఆవాలు - 1 టీ స్పూన్ -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1/2 టీ స్పూన్ -శనగపప్పు - 1/2 టీ స్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు -పసుపు - 1/4 టీ స్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -కొత్తిమీర - గార్నిష్ కోసం -జీడిపప్పు - 1 టేబుల్ స్పూన్ -నిమ్మరసం - కొన్ని చుక్కలు.

తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని 2-3 సార్లు శుభ్రంగా కడిగి అరగంటసేపు నీటిలో నానబెట్టండి. -తర్వాత పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోండి. మీరు కావాలనుకుంటే పాలకూరను కొద్దిగా ఉడికించి లేదా ఆవిరిలో మగ్గించి కూడా ఉపయోగించవచ్చు. -ఇప్పుడు ఉల్లిపాయను సన్నగా తరుగుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీల్చండి. అల్లం,వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఎండుమిర్చిని చిన్న ముక్కలుగా తుంచుకోండి. -స్టవ్ మీద ఒక మందపాటి అడుగు కలిగిన గిన్నె లేదా కుక్కర్ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేసి అవి కొద్దిగా రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు ఎండుమిర్చి,కరివేపాకు వేసి వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు ఇందులో తరిగిన పాలకూర వేసి 2-3 నిమిషాలు లేదా అది మెత్తబడే వరకు ఉడికించాలి. -పాలకూర మగ్గిన తర్వాత కొబ్బరి పాలు పోయాలి. తర్వాత నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేయాలి. పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -గిన్నెకు మూత పెట్టి లేదా కుక్కర్ మూత పెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. మీరు గిన్నెలో ఉడికిస్తుంటే నీరు పూర్తిగా ఇంకిపోయి అన్నం మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఇది సుమారు 15-20 నిమిషాలు పట్టవచ్చు. మీరు కుక్కర్ లో ఉడికిస్తుంటే 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. ప్రెజర్ పూర్తిగా తగ్గిన తర్వాత మూత తీయండి. -అన్నం ఉడికిన తర్వాత ఒకసారి మెల్లగా కలపండి. సన్నగా తరిగిన కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులతో గార్నిష్ చేయండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండితే మరింత రుచిగా ఉంటుంది. -పాలక్ కొబ్బరి అన్నం వేడి వేడిగా రైతా, పెరుగు లేదా ఏదైనా కూరతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

## రాగి పిండితో హెల్దీ బన్ దోశలు..

### పీకలదాకా తిన్నా ఇంకోటి కావాలంటారు..ఎలా చేయాలంటే




మన ఆరోగ్యం మొత్తం దాదాపు మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. కరోనా తర్వాత నుంచి అధికశాతం మంది తమ ఆరోగ్యంపై ఎక్కువ ఫోకస్ పెడుతూ హెల్దీ ఫుడ్ తీసుకుంటున్నారు. హెల్దీ ఫుడ్స్ లో రాగి పిండితో చేసే బన్ దోశలు కూడా ఒకటి. సాధారణంగా పొద్దున్నే పూరీ,బోండా,ఇడ్లీ,బియ్యం పిండితో దోశ వంటివి మనం తింటుంటాం. అయితే ఇవి కాకుండా పొద్దున్నే రాగిపిండితో చేసే హెల్దీ బన్ దోశలు ఓ సారి టేస్ట్ చేసి చూడండి..అస్సలు వదలిపెట్టరు. అంత రుచిగా ఉంటాయి..అంతేకాకుండా ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. రాగి పిండిలో ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి రాగి పిండితో హెల్దీ బన్ దోశలు ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. రాగి పిండితో బన్ దోశలు తయారీకి కావాల్సిన పదార్థాలు -రాగి పిండి -బొంబాయి రవ్వ -పెరుగు -నీళ్లు -ఆవాలు -జీలకర్ర -కరివేపాకు -ఆయిల్ -ఇంగువ -పచ్చిమిర్చి. రాగి పిండితో బన్ దోశలు తయారీ విధానం -రాగి బన్ దోశలు తయారుచేయడం కోసం ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకొని అందులో అరకప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేసి మొత్తం కలిసేలా కలుపుకున్నాక ఇందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టేయాలి. -10 నిమిషాలు నానిన తర్వాత ఈ పిండిని మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు ఏమీ వేయకుండానే దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో ఒకటిన్నర స్పూన్ ఆయిల్ వేడి చేసి ఇందులో కొద్దిగా ఆవాలు,జీలకర్ర వేసి అవి చిటపటలాడిన తర్వాత కొద్దిగా ఇంగువ వేసి కలిపాక 2 పచ్చిమిర్చి తరుగు,కొద్దిగా కరివేపాకు వేసి ఫ్రై అయ్యాక ఇందులో చిన్నగా కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి అవి కొంచెం మెత్తబడేదాకా ఫ్రై చేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.ఈ తాళింపుని ముందుగా రెడీ చేసుకున్న పిండిలో వేసేయాలి. ఇందులోనే సన్నగా కట్ చేసిన 2 ఉల్లియాల ముక్కలు, కొత్తిమీర తరుగు,రుచికి తగినట్లుగా ఉప్పు, కొద్దిగా వంటసోడా వేసి పిండిలో అన్నీ బాగా కలిసేలా కలుపుకోవాలి. - ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి అందులో కొంచెం ఆయిల్ వేసి దానిమీద పెద్ద గరిట పిండిని వేసుకొని ఒకవేపు కాలిన తర్వాత తిప్పుకొని దానిని రెండోవైపు కాల్చి దించేయాలి. అంతే రాగి బన్ దోశలు రెడీ. దీనిని మీకు నచ్చిన చట్నీతో కలిపి తింటే నోట్లో బ్లాస్టే.

## ఇది తినని మనిషి జన్మ ఎందుకు..

### మన పూర్వీకుల ఎనర్జీకి కారణం ఇదే..ఎలా చేసుకోవాలంటే



మీరెప్పుడైనా రాగిపిండి, సగ్గుబియ్యం కిచిడి తిన్నారా? సూపర్ టేస్ట్ ఉంటుంది. ఈ కిచిడి ఒక పోషకమైన,తేలికగా జీర్ణమయ్యే ఆహారం. రాగిలో ఐరన్, కాల్షియం,ఫైబర్ పుష్కలంగా ఉంటాయి..సగ్గ బియ్యం తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ రెండింటి కలయికతో తయారైన కిచిడి రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రాగిపిండి సగ్గుబియ్యం కిచిడిని మీ ఇంట్లోనే సింపుల్ గా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీకి కావలసిన పదార్థాలు -పెసరపప్పు -సగ్గుబియ్యం -రాగిపిండి -మిరియాలు -జీడిపప్పు -పచ్చిమిర్చి -నెయ్యి -అల్లం -పసుపు -క్యారెట్ -ఉల్లిపాయ -టమాటో -వెల్లుల్లి -జీలకర్ర -కరివేపాకు

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీ విధానం -ముందుగా ఓ ప్రెజర్ కుక్కర్ లో శుభ్రంగా కడిగిన అరకప్పు పెసరప్పు, అరకప్పు సగ్గ బియ్యం, 4 పచ్చిమిర్చి ముక్కలు, 1 టమాటో పెద్ద ముక్కలు, 1 ఉల్లిపాయ పెద్ద ముక్కలు, 1 క్యారెట్ ముక్కలు,కొన్ని అల్లం ముక్కలు, పొట్టు తీసిన 2 వెల్లుల్లి రెబ్బలు, 10-15 మిరియాలు, చిటికెడు పసుపు వేయాలి. ఇందులో ముక్కలు మునిగేదాకా నీళ్లు పోసి కలిపి మూతపెట్టి స్టవ్ మీద పెట్టాలి. -రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేసేయండి. ప్రెజర్ అంతా పోయిన తర్వాత కుక్కర్ మూత తీసి ఉడికిన పప్పుని గుత్తితో మెత్తగా మాష్ చేసుకోవాలి. -తర్వాత మళ్లీ స్టవ్ ఆన్ చేసి అది ఉడకనివ్వాలి. ఉడికే సమయంలోనే అందులో అరకప్పు రాగిపిండి ఉండలల్లేకుండా బాగా కలపుతూ మంటను సిమ్ లో పెట్టి ఉడికించుకోవాలి.

10 నిమిషాలు రాగిపిండిని అందులో బాగా ఉడికించుకున్నాక రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి దగ్గరపడేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2-3 స్పూన్ల నెయ్యి వేడి చేశాక జీడిపప్పు,మిరియాలు వేసి ఫ్రై చేసుకోవాలి. -జీడిపప్పు వేగిన తర్వాత కరివేపాకు,జీలకర్ర వేసి వేయించుకొని తర్వాత ఈ తాళింపు మొత్తాన్ని ముందుగా ఉడికించిన కిచిడిలో వేసి కలుపుకోవాలి. ఇందులో అరచెక్క నిమ్మరసం పిండి బాగా కలుపుకోవాలి. అంతే రాగి పిండి సగ్గుబియ్యం కిచిడి రెడీ.

# సినిమా న్యూస్



## దివాళీ వైబ్స్.. గులాబీ పువ్వులా ఆకట్టుకుంటున్న సోఫీ చౌదరి!

సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా సెలబ్రిటీల దీపావళి వేడుకకు సంబంధించిన ఫోటోలు దర్శనమిస్తున్నాయి. టాలీవుడ్ మొదలుకొని బాలీవుడ్ వరకు ప్రతి ఒక్కరూ ఈ దీపావళి వేడుకలను అత్యంత ఘనంగా సంబరంగా జరుపుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరు ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే అటు సింగిల్స్ ఇటు ఫ్యామిలీలు ఫోటోలు షేర్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా గ్లామర్ అందాలతో ఆడియన్స్ ను కట్టిపడేస్తూ దీపావళి వైబ్స్ అంటూ గులాబీ పువ్వులా.. తన మేనిఛాయతో అందరినీ ఆకట్టుకుంది సోఫీ చౌదరి. సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే సోఫీ చౌదరి షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ ఫోటోల విషయానికి వస్తే.. సాఫ్ట్ సిల్క్ లైట్ పింక్ కలర్ చీర కట్టుకున్న ఈమె.. అందుకు కాంబినేషన్ లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి అందాలతో మెస్మరైజ్ చేసింది. పోనీటైల్ వేసి పువ్వులు చుట్టి తన మేకోవర్ను ఫుల్ ఫిల్ చేసింది. సింపుల్ జువెలరీతో తన అందాన్ని రెట్టింపు చేసిందని చెప్పవచ్చు. గులాబీ రంగు చీరలో తన మేనిఛాయను రెట్టింపు చేసుకున్న సోఫీ చౌదరి చిన్నగా స్మైల్ ఇస్తూ ఆ ఫోటోలకు ప్రాణం పోసింది అని చెప్పవచ్చు. ప్రస్తుతం అమ్మడి అందాలు దీపావళి వేళ సరికొత్త కాంతులను నింపుతున్నాయని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోఫి చౌదరి విషయానికి వస్తే.. తన అందంతో నటనతో



ఎప్పటికప్పుడు ఆకట్టుకునే ఈమె బాలీవుడ్ తో పాటూ తెలుగులో కూడా నటించింది.

## రేణూ డెసిషన్ వెనుక రీజనేంటి?



ఒకప్పుడు హీరోయిన్ గా రాణించిన రేణూ దేశాయ్, పవన్ కళ్యాణ్ ను ప్రేమించి పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లలు పుట్టాక ఆయన్నుంచి విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. పవన్ తో విడాకుల తర్వాత పూణెలో సెటిల్ అయిన రేణూ, ఎప్పుడూ ఏదొక విషయంతో వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. గత కొంతకాలంగా యాక్టింగ్ కు దూరంగా ఉంటూ వస్తున్న రేణూ, మొన్నా మధ్య రవితేజ హీరోగా వచ్చిన టైగర్ నాగేశ్వరరావు మూవీలో కనిపించి ఆడియన్స్ ను అలరించిన విషయం తెలిసిందే. యాక్టింగ్ అంటే ఇష్టం.. కానీ అదే టార్గెట్ కాదు!


టైగర్ నాగేశ్వరరావు చేస్తున్నప్పుడు తనపై ఎన్నో విమర్శలు వచ్చాయని, ఎక్కడ చూసినా తానే కనిపిస్తున్నానని, ఎలాంటి సినిమాల్లోనైనా నటిస్తానని అన్నారు. కానీ టైగర్ నాగేశ్వరరావు వచ్చి రెండేళ్లవుతుంది, అప్పట్నుంచి తాను మళ్లీ స్క్రీన్ పై కనిపించలేదని, గతంలో తనను విమర్శించిన వారెవరూ తనకు క్షమాపణలు చెప్పలేదని, మాట్లాడేవాళ్లు ఎలాగైనా మాట్లాడతారని, అందుకే తాను వాటిని పట్టించుకోనని, యాక్టింగ్ పై ఉన్న ఇష్టం వల్లే తాను ఆ సినిమా చేశానని, కానీ యాక్టింగే తన టార్గెట్ కాదని, ఒకవేళ యాక్టింగే తన టార్గెట్ అయితే తాను హీరోయిన్ అయినప్పటి నుంచి ఇప్పటివరకు సినిమాలు చేస్తూనే ఉండేదాన్నని, దాంతో తనకెంతో మంచి పేరు వచ్చుండేదని ఆమె పేర్కొన్నారు. కరోనా టైమ్ లో నిశ్చితార్థం చేసుకున్న రేణూ పవన్ నుంచి విడిపోయాక రేణూ పిల్లలతోనే ఉంటుంది తప్పించి మరో పెళ్లి చేసుకోలేదు. అందరిలానే తనక్కూడా ఓ తోడు కావాలని భావించిన రేణూ కరోనా టైమ్ లో ఓ వ్యక్తితో నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. కానీ పవన్ ఫ్యాన్స్ దాటికి తట్టుకోలేక ఆమె తన ఎంగేజ్మెంట్ ను కూడా క్యాన్సిల్ చేసుకున్నానని ఎన్నో సార్లు చెప్పుకొచ్చారు. ఎంగేజ్మెంట్ ను క్యాన్సిల్ చేసుకున్నప్పటికీ తనకు రెండో పెళ్లి ఆలోచన ఉందని రేణూ పలుసార్లు చెప్పారు.

## అజయ్ ఫ్యామిలీ పిక్స్ చూశారా?



సోషల్ మీడియా పుణ్యమా అని సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలు కూడా బయటకు వస్తున్న విషయం తెలిసిందే . ముఖ్యంగా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలు సెలబ్రిటీలు తమ కుటుంబంతో గడిపిన మధుర క్షణాలను ఇలా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే నిన్న దేశవ్యాప్తంగా దీపావళి పండుగ ఘనంగా జరిగింది. సెలబ్రిటీలు కూడా ఒకరికి మించి మరొకరు చాలా గ్రాండ్గా తమ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఘనంగా ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే తెరకే పరిమితమైన చాలామంది సెలబ్రిటీలు ఇప్పుడు కుటుంబాలను కూడా సోషల్ మీడియా ద్వారా అభిమానులకు పరిచయం చేస్తున్నారు. అలాంటి వారిలో ప్రముఖ నటుడు అజయ్ కూడా ఒకరు అని చెప్పాలి. చాలా రిజర్వ్డ్ గా ఉండే అజయ్ తాజాగా దీపావళి సెలబ్రేషన్స్ లో భాగంగా తన కుటుంబాన్ని అందరికీ పరిచయం చేశారు. తన భార్య శ్వేత రావురితో పాటూ ఇద్దరు కొడుకులతో కలిసి దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అజయ్ ఫ్యామిలీ చాలా క్యూట్ గా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. మరి కొంతమంది అజయ్ కి ఇంత పెద్ద కొడుకులు ఉన్నారా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అటు అజయ్ భార్య కూడా హీరోయిన్స్ కి ఏమాత్రం తక్కువ కాదని.. తన అందంతో ఆమె అందర్నీ కట్టిపడేస్తోందని కూడా కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం. ఇకపోతే అజయ్ పెద్ద కొడుకును చూస్తే మాత్రం సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు.. మంచి హీరో కటౌట్ అంటూ కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్యూట్ ఫ్యామిలీకి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అజయ్ కెరియర్ విషయానికి వస్తే.. విజయవాడలో జన్మించిన ఈయన తండ్రి ఉద్యోగరీత్యా నెల్లూరు, తిరుపతి లకు బదిలీ కావడంతో తన విద్యాభ్యాసాన్ని ఆ ప్రాంతాలలోనే పూర్తి చేశారు.. 1995లో ఎంసెట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం హైదరాబాదు జూబ్లీహిల్స్ లోని ఒక కాలేజీలో చేరాడు. అక్కడే నటన మీద ఆసక్తితో మధు ఫిలిం ఇన్స్టిట్యూట్లో చేరి నటనలో శిక్షణ కూడా తీసుకున్నారు. అజయ్ ఇండస్ట్రీలోకి రావాలన్న కోరికను తన తండ్రికి చెప్పడంతో ఆయన కూడా కాదనలేక కొడుకును ఈ దిశగా ప్రోత్సహించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే అజయ్ తండ్రికి దర్శకుడు వేమూరి జ్యోతి కుమార్ పరిచయం ఉండడంతో కౌరవుడు అనే సినిమాలో అవకాశం కల్పించారు. తొలి సినిమాలో అయితే తండ్రి పలుకుబడితో అవకాశం వచ్చింది కానీ ఆ తర్వాత అవకాశాల కోసం దాదాపు 9 నెలలు ఎదురు చూశారట. చివరికి శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి సహకారంతో ఖుషీ సినిమా నటీనటుల సెలెక్షన్స్ లో ఎంపికయ్యారు. అందులో ఆకతాయి పాత్ర ఈయనకు మంచి గుర్తింపును అందించింది.

## అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకున్న రష్మిక..!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న 'థామా' సినిమాతో నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆయుష్మాన్ ఖురాన హీరోగా నటించిన ఈ హర్రర్ థ్రిల్లర్ మూవీపై అంచనాలు పెరిగే విధంగా రష్మిక మందన్న గత రెండు వారాలుగా ప్రచారం చేసిన విషయం తెల్సిందే. ఇదే సమయంలో రష్మిక తన రాబోయే సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. కానీ థామా సినిమా ప్రమోషన్ సమయంలో అయినా రష్మిక తన వివాహ నిశ్చితార్థం గురించి ఓపెన్ అవుతుందని అంతా భావించారు. కానీ రష్మిక ఆ ప్రశ్నలు రాకుండానే చాలా జాగ్రత్త పడింది. మీడియా సమావేశంలో ఆ విషయాల గురించి ప్రస్తావించిన సమయంలో మౌనంగా నవ్వుతూ ఉండి పోయింది. దాంతో రష్మిక మందన్న, విజయ్ దేవరకొండల యొక్క వివాహ నిశ్చితార్థం గురించి ఇంకా క్లారిటీ రాలేదు అని అభిమానులతో పాటు అంతా ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్న విషయం తెల్సిందే.

తాజాగా రష్మిక మందన్న ఒక చిట్ చాట్లో ప్రేమ విఫలం, ఆ సమయంలో ఇద్దరూ పడే బాధ గురించి మాట్లాడింది. చాలా మంది లవ్ బ్రేకప్ సమయంలో ఎక్కువగా అబ్బాయిలు బాధ పడుతారు, వారే చాలా కాలం పాటు అందులో నుంచి బయటకు రాలేక పోతారు, ఆత్మహత్యలు చేసుకుంటారు, దారుణాలకు వడిగడుతారు అంటూ ప్రచారం ఉంది. పలు సర్వేల్లోనూ అదే విషయం వెల్లడి అయింది. కానీ రష్మిక మాత్రం అందుకు విరుద్ధంగా చెప్పుకొచ్చింది. ప్రేమ విఫలం అయిన సమయంలో అబ్బాయిలు మాత్రమే బాధ పడుతారు అంటూ ఉన్న ప్రచారంను ఆమె కొట్టి పారేసింది. అబ్బాయిలు ఎక్కువగా బాధ పడుతారు అంటే తాను ఒప్పుకోను అంది. అబ్బాయిలకు ఏమాత్రం తగ్గకుండా, వారి రిలేషన్షిప్ విషయంలో అమ్మాయిలు కూడా చాలా సీరియస్గా ఉంటారని రష్మిక మందన్న తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఇంకా రష్మిక మందన్న మాట్లాడుతూ... అమ్మాయిలు బాధను వ్యక్తపరిచేందుకు మార్గాలు లేవు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. అబ్బాయిలు ప్రేమ విఫలం అయిందంటే గడ్డాలు పెంచుకోవడం, మందు తాగడం చేస్తారు. కానీ అమ్మాయిలు అలా చేయలేరు. పెంచుకోవడానికి గడ్డం ఉండదు, అలాగే మందు తాగి తమ ప్రేమ విఫలం గురించి బయట పడరు అంది. అమ్మాయిలకు తమ ఆవేదన వ్యక్తం చేసుకునేందుకు ఎక్కువ మార్గాలు లేకపోవడం వల్లే అబ్బాయిలకు ఈ విషయంలో ఎక్కువగా సానుభూతి లభిస్తుంది అంటూ రష్మిక మందన్న ఈ విషయంలో అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఆమెకు మద్దతుగా అమ్మాయిలు స్పందిస్తూ ఉంటే, కొందరు అబ్బాయిలు మాత్రం రష్మిక అభిప్రాయం ను వ్యతిరేకిస్తున్నారు.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com